క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

గూడూరు: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గూడూరు మండలం ముక్కొల్లులో శుక్రవారం జరుగుతుందని సర్పంచి సమ్మెట జయవర్దన్ తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ గ్రామంలోని ప్రతి ఇంటినీ సందర్శించి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను అందిస్తారని, స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుంటారని చెప్పారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పెన్షనర్ల వితరణ



మచిలీపట్నంటౌన్: 41వ డివిజన్‌కు చెందిన పింఛనుదారు చిలుమూరి బాబూరావు ఇటీవల మృతి చెందాడు. తోటి పింఛనుదారులు ఒక్కొక్కరు రూ. 100 చొప్పున సేకరించిన రూ.29,600 నగదును గురువారం బాబూరావు కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, వలంటీర్లు, గృహ సారధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లీడ్స్-కేర్ సపోర్ట్ సెంటర్‌లో తనిఖీలు



మచిలీపట్నంటౌన్: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక మల్కాపట్నంలో నిర్వహిస్తున్న లీడ్స్-కేర్ సపోర్ట్ సెంటర్‌లో సొసైటీ జాయింట్ డైరెక్టర్ కె. సుబ్రహ్మణ్యం, కన్సల్టెంట్ ఎం. విజయకుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సపోర్ట్ సెంటర్‌కు సంబంధించిన పలు రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. నెలవారీ రిపోర్టులను, తొమ్మిది కేటగిరీ లైన్ జాబితాలను, ఏఆర్‌టీ సెంటర్ డేటాను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు చైర్మన్ ఇందుపల్లి నాగరత్నం, ప్రాజెక్టు డైరెక్టర్ డి. సమాధానం, ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఎం. అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నందీశ్వరునికి అభిషేకాలు



నాగాయలంక: మాస శివరాత్రి, అమావాస్యకు ముందు వచ్చే త్రయోదశి పర్వతిథిని పురస్కరించుకు స్థానిక శ్రీరామ పాదక్షేత్రం వద్ద నందీశ్వరునికి గురువారం రాత్రి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి మండపంలో నందీశ్వరునికి ఆవు పాలు, ఆవు పెరుగు, నెయ్యి, తేనె పంచదార, పండ్ల రసాలు-పసుపు, కుంకుమ, పన్నీరు తదితరాలతో అభిషేకించారు. ఈ సందర్భంగా భక్తులకు కూడా నందిని అభిషేకించేందుకు అవకాశం కల్పించారు. అనంతరం నంది, శివయ్యను ప్రత్యేకంగా అలంకరించి ఏక కాలంలో విశేష హారతి ఇచ్చి మంత్రపుష్ప నీరాజనాలు సమర్పించారు. ఉప్పల లీలా కృష్ణప్రసాద్, బోయపాటి రాము, తలశిల రఘుశేఖర్, కనిగంటి వెంకట నారాయణ పర్యవేక్షించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నంటౌన్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆదేశాల ప్రకారం టెన్త్, ఇంటర్మీడియెట్ తరగతుల్లో ప్రవేశాల కోసం అభ్యర్థులు అపరాధ రుసుం లేకుండా ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని డీఈఓ తాహెరా సుల్తానా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు నగదు చెల్లింపులు ఆన్‌లైన్ ద్వారా చేయవచ్చునన్నారు. ఇతర సమాచారం కోసం ఓపెన్ స్కూల్స్ హెల్ప్‌లైన్ నంబర్ 8008403506ను సంప్రదించాలని కోరారు.

టిడ్కో ఇళ్ల తాళాలు అందజేత

గుడివాడ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేదవానికి సొంత ఇల్లు ఉండాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన టిడ్కో ఇళ్ల తాళాలను లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. స్థానిక కైకల సత్యనారాయణ కళామందిరంలో గురువారం స్థానిక 11వ వార్డుకు చెందిన 114 మంది లబ్ధిదారులకు ఈ తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అన్ని వసతులతో కూడిన గృహాలను అందజేయడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తాము రుణపడి ఉంటామని లబ్ధిదారులు అంటున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు వీరిశెట్టి నరసింహారావు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అందరికీ వైద్యం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



కోసూరివారిపాలెంలో శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కోసూరువారిపాలెం(మోపిదేవి): జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా అందరికీ వైద్యం మరింత చేరువైందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. మండలంలోని కోసూరువారిపాలెం జెడ్పీ పాఠశాల ఆవరణలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ దూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకోలేని వారు స్వగ్రామంలోనే వైద్యం చేయించుకునేలా ఇప్పటికే వెల్‌నెస్ సెంటర్స్‌ను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రారంభించిందని చెప్పారు. వైద్యాన్ని మరింత చేరువ చేసేందుకు గ్రామాల్లోనే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించి నిపుణులైన డాక్టర్లచే వైద్య పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేస్తున్నారని చెప్పారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజల మేలు కోసం ఆలోచించే జగనన్నను మరోసారి దీవించాలని కోరారు. మండల పరిధిలోని 13 పంచాయతీల్లోనూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఏర్పాటు చేసి 8 వేల మందికి పైగా రోగులకు వైద్య పరీక్షలు చేయించి మందులు అందచేశారని వివరించారు. సర్పంచ్‌లు కోసూరు అనూష, గరికిపాటి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్‌బాబు, సచివాలయ మండల కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరరావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ కె. నవీన్‌కుమార్, వైద్యులు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం..

పెడన: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా నిరుపేదల ఇళ్ల వద్దకే కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్య సేవలను జగనన్న ప్రభుత్వం అందిస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ తనయుడు, యువ నాయకుడు జోగి రాజీవ్ అన్నారు. పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం కాకర్లమూడి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎంపీపీ రాజులపాటి వాణి ప్రారంభించారు. 358 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఇద్దరికి హార్ట్ ప్రోబ్లమ్స్ ఉండటంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేశారు. 78 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 19 మందిని కళ్లజోళ్లకు రిఫర్ చేశారు. ఐదుగురికి శస్త్రచికిత్సలు చేయాల్సి ఉంటుందని, తుది పరీక్షలు చేయించుకోవాలని మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రిలోని కంటి విభాగానికి సిఫార్సు చేశారు. పిల్లల డాక్టర్ సుదేష్‌బాబు, ఈఎన్‌టీ వైద్యురాలు డాక్టర్ అఖిలాండేశ్వరి, డాక్టర్ మీనాదేవి, డాక్టర్ శ్యామ్‌బాబు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో రాజులపాటి అచ్యుతరావు, వైస్ ఎంపీపీ వరసా వాకాలమ్మ, ఎంపీడీఓ రెడ్డయ్య పాల్గొన్నారు.

సాతులూరులో 556 మందికి వైద్య పరీక్షలు

బంటుమిల్లి: సాతులూరు ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన శిబిరంలో 556 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. శిబిరాన్ని ఎంపీపీ వెలివెల చినబాబు ప్రారంభించారు. పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి కె. రాజ్యాలక్ష్మి, వైద్య నిపుణులు అనిరుధ్, అచ్యుత్, ప్రవీణ్, కె. పవన్‌కుమార్, సీహెచ్ సౌందర్య, కె. సువర్చల, పి. జయశ్రీ వైద్య సేవలను అందించారు. సర్పంచ్ గొల్ల బాలస్వామి, తహసీల్దార్ ఎంవీ సత్యనారాయణ, ఎంపీడీఓ స్వర్ణభారతి పాల్గొన్నారు.

తరకటూరులో..

గూడూరు: గూడూరు మండలం తరకటూరు శిబిరంలో 823 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి టి.మాధురి ఆధ్వర్యంలో మచిలీపట్నం, గూడూరు ఆస్పత్రుల వైద్య నిపుణులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 13 మంది రోగులకు మెరుగైన వైద్య చికిత్స అవసరమని నిర్ధారించి నెట్‌వర్క్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ ప్రారంభించారు. గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు, కేడీసీసీబీ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావు, ఎంపీటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు, సర్పంచి చిన్నం వెంకట రమణమ్మ, కో- ఆప్షన్ సభ్యుడు కరీముల్లా, వైఎస్సార్ సీపీ నాయకులు పర్చం పెదబాబు, కనపర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

వి.కొత్తపాలెంలో..

కోడూరు: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంత ప్రజల ముంగిటకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య సేవలందిస్తున్నారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గురువారం మండలంలోని వి.కొత్తపాలెం సచివాలయం పరిధిలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని వివరించారు. వైద్య నిపుణులు మౌనిక, పార్వతి, అవినాష్, శైలేంద్రకుమార్, జయచంద్రలు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి 480మందికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, మండల కన్వీనర్ వరెశె మాధవరావు, సర్పంచి యలవర్తి నాంచారయ్య, ప్రజాప్రతినిధులు, అధికారులు, పాల్గొన్నారు.

నంగేగడ్డలో..

నంగేగడ్డ(నాగాయలంక): మండలంలోని నంగేగడ్డ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఐదుగురు డాక్టర్ల బృందం 550 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్, తహసీల్దార్ జె.విమలకుమారి, సర్పంచ్ తోట లంకమ్మ, తోట కృష్ణ, సీతారామ్ కుమార్, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



వి.కొత్తపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి



నంగేగడ్డలో రోగులకు సూచనలిస్తున్న వైద్య సిబ్బంది



కాకర్లమూడిలో మందులు అందజేస్తున్న రాజీవ్, ఎంపీపీ వాణి

పకడ్బందీగా మూడో విడత రీ-సర్వే

కలెక్టర్ రాజాబాబు



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ రాజాబాబు. చిత్రంలో జేసీ అపరాజితసింగ్, డీఆర్వో వెంకట రమణ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో మూడో విడత రీ-సర్వే కార్యక్రమం పకడ్బందీగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ పి. రాజాబాబు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డికి తెలిపారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రీ-సర్వే, జాతీయ రహదారుల కోసం భూ సేకరణ, జగనన్న పాలవెల్లువ, ఉపాధి హామీ పథకం తదితర పథకాలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ జిల్లా ప్రగతిని వివరిస్తూ మూడో విడత రీ-సర్వే కార్యక్రమం 136 గ్రామాల్లో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు 83 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ కార్యక్రమం పూర్తయ్యిందన్నారు. 11 గ్రామాల్లో 13వ నోటిఫికేషన్ పూర్తి చేశామని చెప్పారు. జిల్లాలో 1,38,622 మంది రైతులకు ఈ-కేవైసీ పూర్తి చేశామని తెలిపారు. 282 గ్రామ సచివాలయ భవనాలకు గానూ 165 భవనాలు పూర్తి చేశామని, 172 ఆర్బీకేలకు గానూ 97 భవనాలు పూర్తి చేశామని, 123 వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలకు గానూ 29 భవనాలు పూర్తి చేశామని వివరించారు. జిల్లాలో 71 గోడౌన్ల నిర్మాణానికి 59 గోడౌన్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయన్నారు. జగనన్న పాలువెల్లువ పథకాన్ని బాపులపాడు మండలంలోని 16 గ్రామాల్లో అమలు చేస్తున్నామన్నారు. 840 మంది పాడి రైతులు ఈ పథకానికి సంబంధించి దరఖాస్తు చేసుకున్నారని, వారికి బ్యాంకుల ద్వారా రుణాలు అందించి పథకంలో భాగస్వాములయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ అపరాజితసింగ్, డీఆర్వో పి. వెంకటరమణ, మార్కెటింగ్ ఏడీ నిత్యానందం తదితరులు పాల్గొన్నారు.

నేటి 'జగనన్నకు చెబుదాం' వాయిదా

చిలకలపూడి(మచిలీపట్నం): చల్లపల్లిలో శుక్రవారం నిర్వహించాల్సిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం వాయిదా పడిందని కలెక్టర్ పి. రాజాబాబు గురువారం తెలిపారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ సహాయ మంత్రి ఎ. నారాయణస్వామి మచిలీపట్నం పర్యటన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని వాయిదా వేశామని చెప్పారు. చల్లపల్లి మండల ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

కళ్లెదుటే కలల సౌధం





పెడన పైడమ్మ జగనన్న లే అవుట్‌లో పూర్తయిన ఇళ్లు : పెడన పల్లోటి-1 లే అవుట్‌లో గృహ ప్రవేశం చేసిన కుటుంబానికి వస్త్రాలు అందజేస్తున్న రాజీవ్, నాగకుమారి

- అర్హులైన పేదలందరికీ ఇళ్లు మంజూరు
- నిరుపేదల పక్షాన నిలిచిన జగనన్న ప్రభుత్వం
- పండుగ వాతావరణంలో గృహ ప్రవేశాలు
- జగనన్న లే అవుట్ ఆర్చ్ నిర్మాణానికి శంకుస్థాపన

పెడన: కళ్లెదుటే కలల సౌధం కనిపించడంతో లబ్ధిదారులు పరవశులయ్యారు. గృహ ప్రవేశాలు చేసి మురిసిపోయారు. తమ సొంతింటి కలను సాకారం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పెడన పట్టణం పైడమ్మ ఆలయం సమీపంలోని జగనన్న లే అవుట్‌లో లబ్ధిదారులు గురువారం గృహ ప్రవేశాలు చేయడంతో పండుగ వాతావరణం నెలకొంది. పైడమ్మ ఆలయం సమీపంలోని జగనన్న లే అవుట్ వద్ద ఆర్చి నిర్మాణానికి, పలు ఇళ్లల్లో గృహ ప్రవేశాలకు మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారితో కలిసి జోగి రాజీవ్ శ్రీకారం చుట్టారు. పల్లోటి-1 లే అవుట్‌లో కూడా పలువురు ఇళ్లల్లోకి వెళ్లడానికి గృహ ప్రవేశాలను రాజీవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇళ్లల్లోకి వెళ్లిన కుటుంబాలకు రాజీవ్ నూతన వస్త్రాలను బహూకరించారు. రాజీవ్ మాట్లాడుతూ ఏ ప్రభుత్వం కూడా పేదలకు ఇళ్లు మంజూరు భారీ స్థాయిలో చేసిన దాఖలాలు లేవన్నారు. గత టీడీపీ హయాంలో ఒక్క ఇల్లు మంజూరు చేసినట్లు కూడా లేదని చెప్పారు. ఒక పక్క పేదలకు ఇళ్లు ఇచ్చేందుకు జగనన్న ప్రభుత్వం సన్నద్ధమవుతుంటే వారికి ఇవ్వనీయకుండా కోర్టులకు వెళుతూ స్టేలు తీసుకువస్తూ అడ్డుకుంటున్నారని దుయ్యబట్టారు. అటువంటి వారిని ఉపేక్షించవద్దని, పేదలకు ఎప్పుడూ అండగా నిలిచే జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లను మంజూరు చేస్తామని, ఇప్పటికే భారీ స్థాయిలో అర్హులకు ఇళ్లను మంజూరు చేయడంతో వారంతా నిర్మించుకున్నారని వివరించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, హౌసింగ్ డీఈ ఎ. శ్రీనివాసరావు, కమిషనర్ మహేంద్ర, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మల్లి, కౌన్సిలర్లు పిచ్చిక సతీష్‌బాబు, మెట్ల గోపీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమల నిర్మూలన మందు పిచికారీ

మోపిదేవి: మోపిదేవిలో దోమల నిర్మూలన మందును పిచికారీ చేశారు. సర్పంచ్ నందిగం మేరీ రాణి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం దోమల నివారణ మందు స్ప్రే చేయించారు. పాలక వర్గ సభ్యులు కేసగాని రాంబాబు, నందిగం అభిషేకరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే సింహాద్రి పరామర్శ

వల్లపల్లి: ఏపీ రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ దిల్‌షాద్ నజరానాను అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పరామర్శించారు. నజరానా మాతృమూర్తి నజ్మాబేగం ఇటీవల మృతి చెందగా, గురువారం సాయంత్రం స్థానిక ఇస్లాంనగర్‌లో వారి ఇంటి వద్ద నజరానాను ఎమ్మెల్యే పరామర్శించారు. నజ్మాబేగం మృతికి సంతాపం తెలిపారు. ఏఎంసీ డైరెక్టర్ అబ్దుల్ అర్షద్, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ యడ్ల జగదీష్ పాల్గొన్నారు.

- కోడూరు: వృద్ధాప్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందిన కోట నాంచారమ్మ (103) కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు గురువారం పరామర్శించారు. మృతురాలి కుమారుడు దివంగత కోట వెంకట నరసయ్య వీఆర్వోగా పనిచేశాడు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, మండల కన్వీనర్ వరెశె మాధవరావు, వెంకన్న ఆలయ ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్, ఎంపీటీసీ బడే గంగాధరరావు పాల్గొన్నారు.

నేడు ఎలుకల నివారణ మందు పంపిణీ

పెడన: ఎలుకల నివారణ మందును మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో శుక్రవారం ఒక్క రోజు మాత్రమే రైతులకు ఉచితంగా అందిస్తామని పెడన ఏఓ జీవీ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులంతా కలిసి ఒకేసారి సామూహికంగా ఎలుకల నివారణ చర్యలు చేపట్టినప్పుడే మంచి ఫలితాలుంటాయన్నారు. ఒక్కొక్క రైతు మాత్రమే ఎలుకల మందును పెడితే పక్క పంట పొలాల్లోకి చేరి తిష్టవేసి మరికొన్నాళ్లకు అన్ని పంట పొలాల్లోకి వచ్చే స్థాయని చెప్పారు. ఈ విషయాలను గమనించి రైతులంతా కలిసి మూకుమ్మడిగా ఎలుకలను నివారించేందుకు పూర్తిస్థాయిలో పంట పొలాల్లో ఎలుకల మందును వినియోగించాలని సూచించారు. శుక్రవారం ఆర్‌బీకేలలో ఉచితంగా అందజేస్తున్న బ్రోమోడయోలిన్ మందును అంతా వినియోగించుకునేలా రైతులు ప్రణాళికలను త్వరితగతిన రూపొందించుకుని అమలు చేసుకోవాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలోని ఆర్‌బీకేలలో స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా ఎలుకల నివారణ మందు పంపిణీ కార్యక్రమం చేపట్టాలని వీఏఏ, ఎంపీఈఓలను ఏఓ ఆదేశించారు.

ఘనంగా ప్రపంచ దృష్టి దినోత్సవం



విద్యార్థులకు కళ్లజోళ్లను అమర్చుతున్న ఎంపీపీ అశోక్‌కుమార్

పామర్రు: జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం 24న ప్రపంచ దృష్టి దినోత్సవం స్థానిక విష్ణాలయం కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సర్వేంద్రియానాం నయనం ప్రధానం అనే సూక్తిని ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. కళ్లు లేనిదే ప్రపంచం లేదని, కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరికీ ఉన్నదని అన్నారు. అనంతరం అంధత్వ సమస్యతో బాధ పడుతున్న చిన్నారులకు కళ్ల జోళ్లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ స్వరూపరాణి, సర్పంచ్ కె. కస్తూరి, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ డి. బాల వెంకటేశ్వరరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కూచిపూడి రోటరీ ఆధ్వర్యంలో..

కోసూరు(మొవ్వ): ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మొవ్వ మండలం కోసూరులో అసిస్టెంట్ ఆప్తామాలజిస్ట్ డి. కోశోర్‌ని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ఘనంగా సత్కరించారు. కూచిపూడి రోటరీ అధ్యక్షుడు కె. రామాంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, ఎంపీపీ కొండేటి ఇందిర, గ్రామ సర్పంచ్ పెనుమూడి రమేష్, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, ఎంపీడీవో జి. సుధాప్రవీణ్, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధితో భవిష్యత్తు

గుడివాడ టౌన్: నైపుణ్యాలను మెరుగుపరుచుకున్న వారు మంచి భవిష్యత్ పొందుతారని కృష్ణాజిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న రెండు వారాల కంప్యూటర్ శిక్షణ నైపుణ్య శిబిరాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా యువత నైపుణ్యాభివృద్ధి కోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ శిక్షణలో నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకున్న వారికి మెరుగైన ఉపాధి దొరుకుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ జి. వెంకటరత్నం పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



మచిలీపట్నంటౌన్: 16వ డివిజన్‌లో ఐదురోడ్ల సెంటర్ నుంచి చిత్రాలయ స్టూడియో సెంటర్ వరకు ఉన్న రహదారిలో ఆక్రమణలను సచివాలయ సిబ్బంది గురువారం తొలగించారు. ఆ రోడ్డులో డ్రెయిన్లపై ఉన్న ఆక్రమణలను తొలగించే పనులు చేపట్టారు. ఇటీవల మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ డివిజన్‌లో పర్యటించిన సందర్భంలో డ్రెయిన్‌లో సిల్టు పేరుకుపోవడంతో మురుగునీరు పారుదల జరగక పొంగి రోడ్లపైకి చేరుతోందని మహిళలు ఫిర్యాదు చేశారు. స్పందించిన మేయర్ ఆ రోడ్డులో డ్రెయిన్లపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో గురువారం ఆక్రమణల తొలగించే పనులతో పాటు ఆ ప్రాంతంలో పొక్లెయిన్‌తో డ్రెయిన్ తవ్వకం పనులు చేపట్టారు. టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేత



కృత్తివెన్ను: మండల పరిధి పల్లెపాలెం ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థిని అద్దంకి హోలీఏంజెల్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంతకంతో కూడిన ప్రశంసాపత్రం లభించిందని పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం కె. సూర్యప్రకాష్ తెలిపారు. భారత ప్రభుత్వం గత ఏడాది పరీక్షా పే చర్చఅంశంపై రాతపరీక్ష నిర్వహించిందని చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థినికి ప్రశంసాపత్రం వచ్చిందన్నారు. విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీలకు ఎస్‌పీఎస్ విద్యార్థులు

గుడివాడ టౌన్: రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల ఖో-ఖో పోటీలకు గుడివాడ ఎస్‌పీఎస్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని టీఎంఈ రాణి తెలిపారు. తమ పాఠశాలకు చెందిన టి. తిమోతీ, ఎస్‌కే ఆసిఫ్, ఎం. దుర్గాప్రసాద్, డి. రాకేష్, ఎస్. మహేష్, డి. దిలీప్ ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈనెల 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు చిత్తూరు జిల్లా యాదమరిలో జరిగే 42వ రాష్ట్రస్థాయి జూనియర్ ఖో-ఖో పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులను అభినందించారు.